క్లుప్తంగా...

బీబీకా ఆలంను దర్శించుకున్న ఎమ్మెల్యే



ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీకి దట్టీ కడుతున్న నిర్వాహకులు

డబీర్‌పురా: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా శుక్రవారం 9వ రోజు సందర్భంగా డబీర్‌పురా బీబీకా అలావాను ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ సందర్శించి ఆలంలకు పూలు, దట్టీలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అలావా ముతవల్లీ ఆసిఫ్ ఆయనకు ఘనంగా స్వాగతం పలికి దట్టీలు కట్టారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ ఎమ్మెల్సీ రియాజుల్ హసన్ హఫందీ, మజ్లిస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అబిడ్స్ ట్రాఫిక్ నూతన పోలీస్‌స్టేషన్ ప్రారంభం



అబిడ్స్: నగర పాత కలెక్టరేట్ ఆర్డీఓ కార్యాలయంలో అబిడ్స్ ట్రాఫిక్ నూతన పోలీస్‌స్టేషన్‌ను నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ సుధీర్ బాబు ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా అబిడ్స్ చౌరస్తాలో కొనసాగుతున్న అబిడ్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను నాంపల్లి స్టేషన్ రోడ్డులోని పాత కలెక్టరేట్ భవనంలోకి మార్చారు. నగర అదనపు కమిషనర్ సుధీర్‌బాబు, డీసీపీ రాహుల్ హెగ్డే, అదనపు డీసీపీ రంగారావు, ఏసీపీ రత్నం, ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస వర్మ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ప్రజలు నూతన ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

దివంగత కాంగ్రెస్ నేతలకు నివాళి



కాసు బ్రహ్మానందరెడ్డి, జైపాల్ రెడ్డి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నేతలు

నాంపల్లి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత కాసు బ్రహ్మానందరెడ్డి జయంతి, కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను శుక్రవారం నాంపల్లిలోని గాంధీభవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇరువురి నేతల చిత్రపటాలకు పలువురు కాంగ్రెస్ నేతలు పూలమాలలను వేసి నివాళులర్పించారు. టీపీసీసీ కోశాధికారి సుదర్శన్‌రెడ్డి, నాయకులు కుమారరావు, సూర్యా నాయక్, పాషా ఉన్నారు.

గుండెపోటుతో అడ్వకేట్ రమేష్‌రావు మృతి



జియాగూడ: జియాగూడ డివిజన్ బీజేపీ కాంటెస్టెడ్ కార్పొరేటర్, బీజేపీ సీనియర్ నాయకుడు శ్రీ వీర శైవ కక్కయ్య డోర్ సమాజ్ చీఫ్ ప్యాట్రన్ భజనమండలి నిర్వాహకుడు ఎస్.రమేష్‌రావు (అడ్వకేట్) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందాడు. దీంతో జియాగూడ, డోర్‌బస్తీలో విషాదఛాయలు అలుముకున్నాయి. 45 ఏళ్లుగా సమాజ సేవలో ఉండడంతో పాటు అడ్వకేట్ వృత్తి, భజనకీర్తనల కచేరీలు సైతం నిర్వహించేవాడు. దీంతో బీజేపీ, జియాగూడ, డోర్‌సమాజ్, భజనమండలి బృందాలు పెద్ద ఎత్తున ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్నారు. శనివారం ఉదయం అంత్యక్రియలు పురానాపూల్ శంషాన్‌ఘాట్‌లో నిర్వహిస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

విజయనగర్‌కాలనీ: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిసంఘటన శుక్రవారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ హైమా తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేటకు చెందిన బింగి రామయ్య 15 ఏళ్ల క్రితం రసూల్‌పురాకు వచ్చి ఉంటున్నాడు. ఇతని కుమారుడు రమేష్ (27)కు ఆరు నెలల క్రితం వివాహం అయ్యింది. గుడిమల్కాపూర్‌లోని సాయినాథ్ వైన్స్ వద్ద పల్లీలు, చుడ్వ తదితర తినుబండారాలు విక్రయిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇదిలా ఉండగా ఉదయం 11:20 గంటలకు పల్లీలు వేడి చేసేందుకు స్విచ్‌బోర్డులో ప్లగ్ పెడుతుండగా విద్యుత్‌షాక్ తగిలి కిందపడి స్పృహ కోల్పోయాడు. అక్కడ ఉన్న వారు ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించి వైద్యులు అప్పటికే రమేష్ మృతిచెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నేడు చార్మినార్ ప్రధాన వీధుల్లో

బీబీకా ఆలం ఊరేగింపు



బీబీకాఆలంకు పూలు, దట్టీలు సమర్పిస్తున్న ప్రత్యేక కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్, జోనల్ కమిషనర్ వెంకన్న

- అదనపు బలగాలతో భారీ బందోబస్తు
- బీబీకా అలావాను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించిన అరవింద్ కుమార్, అంజనీకుమార్
- ఊరేగింపు సందర్భంగా కొనసాగనున్న ట్రాఫిక్ నిబంధనలు
- వాహనదారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు..

చార్మినార్: డబీర్‌పురాలోని బీబీకాఅలావాను రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ ప్రత్యేక కార్యదర్శి అరవింద్‌కుమార్ తదితరుల బృందం శుక్రవారం సందర్శించి అక్కడ ప్రతిష్ఠించిన ఆలంలకు పూలు, దట్టీలు సమర్పించారు. అనంతరం శనివారం పాతబస్తీ వీధుల్లో నిర్వహించనున్న బీబీకాఆలం అంబారీ సామూహిక ఊరేగింపు ఏర్పాట్లను పరిశీలించారు. ఆయనకు జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న అషూర్‌ఖానాల వద్ద ఏర్పాట్లు, అభివృద్ధి పనులను అరవింద్ కుమార్‌కు వివరించారు. అలాగే డీజీపీ అంజనీకుమార్ కూడా బీబీకాఅలావాను సందర్శించి శనివారం జరుగనున్న మొహర్రం ఏర్పాట్లు, నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఊరేగింపు బందోబస్తు వివరాలు, ఏర్పాట్లను డీసీపీ సాయి చైతన్య డీజీపీ అంజనీకుమార్‌కు వివరించారు. శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కొనసాగనున్న బీబీకాఆలం ఊరేగింపునకు అదనపు బలగాలతో బందోబస్తు నిర్వహిస్తున్నామని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య తెలిపారు. దక్షిణ మండలంలోని 600 మంది పోలీసు సిబ్బందితో పాటు 2 రాపిడ్ యాక్షన్ ఫోర్సు, 8 ప్లాటూన్ల పోలీసు సిబ్బంది, 750 మంది అదనపు బలగాలను బందోబస్తులో వినియోగిస్తున్నామన్నారు.

నేడు పాతబస్తీలో కొనసాగనున్న ట్రాఫిక్ ఆంక్షలు..

- శనివారం పాతబస్తీ ప్రధాన వీధుల్లో నిర్వహించే పదో మొహర్రం సామూహిక ఊరేగింపునకు ట్రాఫిక్ నిబంధనలు అమలులో ఉంటాయని నగర పోలీసు కమిషనర్ ఓ ప్రకటనలో తెలిపారు.
- బీబీకా ఆలంల సామూహిక ఊరేగింపు ముగిసేంత వరకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా దారి మళ్లించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.
- శనివారం మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా దారి మళ్లింపులు కొనసాగుతాయన్నారు.
- బీబీకా అలావా వైపు వచ్చే వాహనాలను సునార్‌గల్లీ టీ–జంక్షన్ వద్ద నుంచి డబీర్‌పురా దర్వాజా, గంగనాగర్, యాకుత్‌పురా వైపు దారి మళ్లించనున్నారు.
- షేక్ ఫైజ్ కమాన్ నుంచి వాహనాలను జబ్బార్ హోటల్, డబీర్‌పురా దర్వాజా, చంచల్‌గూడ వైపు దారి మళ్లించనున్నారు.
- ఎతేబార్‌చౌక్ నుంచి వాహనాలను బడాబజార్ వైపు అనుమతించకుండా ఎతేబార్‌చౌక్ వద్ద నుంచి కోట్లా ఆలిజా, పురానాపూల్ వైపు దారి మళ్లించనున్నారు.
- యాకుత్‌పురా గంగానగర్ నాలా వద్దకు ఊరేగింపు వచ్చినప్పుడు పురానీహవేలి నుంచి వచ్చే వాహనాలను ఎతేబార్‌చౌక్, పురానీహవేలీ వైపు అనుమతించకుండా చెత్తబజార్, డబీర్‌పురా లేదా ఎస్‌జే రోటరీ వైపు నుంచి దారి మళ్లించనున్నారు.
- మొఘల్‌పురా, ఓల్డా హోటల్ నుంచి వచ్చే వాహనాలను బీబీబజార్ ఎక్స్ రోడ్డు, పారీస్ కేఫ్, తలాబ్‌కట్టా వైపు నుంచి దారి మళ్లించనున్నారు.
- మిట్టికాషేర్, మదీనా నుంచి వచ్చే వాహనాలను గుల్జార్‌హౌస్, మదీనా, మిట్టికా షేక్ వైపు నుంచి దారి మళ్లించనున్నారు.
- మొఘల్‌పురా వాటర్ ట్యాంక్ నుంచి వాహనాలను చౌక్ మైదాన్‌ఖాన్ వైపు అనుమతించకుండా హఫీజ్‌డంకా మసీదు, పారీస్ కేఫ్, బీబీబజార్ వైపు నుంచి దారి మళ్లించనున్నారు.
- షక్కర్‌కోట నుంచి వాహనాలను గుల్జార్‌హౌజ్ వైపు అనుమతించకుండా మిట్టికాషేర్ జంక్షన్, ఘాన్సీబజార్ లేదా చెలాపురా మీదుగా ఎతేబార్‌చౌక్, కోట్లా ఆలిజా లేదా పురానీహవేలి మీదుగా దారి మళ్లించనున్నారు.
- నయాపూల్ నుంచి వాహనాలను చార్మినార్‌కు అనుమతించకుండా మదీనా ఎక్స్ రోడ్డు, సిటీ కాలేజీ మీదుగా దారి మళ్లించనున్నారు.
- ఛాదర్‌ఘట్, రోటరీ, నూర్‌ఖాన్‌బజార్, సాలార్‌జంగ్ మ్యూజియం, శివాజీ బ్రిడ్జి నుంచి వచ్చే వాహనాలను పురానీహవేలి వైపు అనుమతించకుండా సాలార్‌జంగ్ రోటరీ, నయాపూల్, శివాజీ బ్రిడ్జి, నూర్‌ఖాన్‌బజార్ మీదుగా దారి మళ్లించనున్నారు.
- చాదర్‌ఘట్, రోటరీ నుంచి వాహనాలను కాలికబర్ వైపు అనుమతించకుండా చాదర్‌ఘట్, రోటరీ, రంగ్‌మహల్ లేదా కోటి, చాదర్‌ఘట్ బ్రిడ్జి మీదుగా దారి మళ్లించనున్నారు.
- గౌలిగూడ, అఫ్జల్‌గంజ్ వైపు నుంచి వచ్చే వాహనాలను సాలార్‌జంగ్ మ్యూజియం, శివాజీ బ్రిడ్జి వైపు అనుమతించకుండా అఫ్జల్‌గంజ్, గౌలిగూడ మీదుగా దారి మళ్లించనున్నారు.
- సాలార్‌జంగ్ రోటరీ నుంచి వాహనాలను నయాపూల్, మదీనా మీదుగా దారి మళ్లించనున్నారు.
- పాతబస్తీ శివారు జిల్లా నుంచి వచ్చే టీఎస్‌ఆర్టీసీ బస్సులను రంగ్‌మహల్, అఫ్జల్‌గంజ్ వైపు దారి మళ్లించనున్నారు.
- ఆలంల ఊరేగింపు ముగిసేంత వరకు కాలికబర్, మీరాలంమండి వైపు బస్సులు, వాహనాలను అనుమతించరు.

కనువిందుగా.. త్రివేణి సంగమం



వరదలతో వాగులు కళకళలాడుతున్నాయి. హిమగంగగా పిలవబడే కొడంగల్ నుండి హిమయత్‌సాగర్ జలాశయం మీదుగా ఈసా, ముచుకుందగా పిలవబడే మూసా అనంతగిరి కొండల నుండి గండిపేట మీదుగా లంగర్‌హౌస్ వద్ద గుప్తగంగతో కలిసి త్రివేణి సంగమంగా మారుతుంది. ఇక్కడి నుండి మూసీగా మారి ప్రవహిస్తుంది. ప్రస్తుతం ఈ మూడు కలయిక ప్రాంతమయిన లంగర్‌హౌస్ త్రివేణి సంగమం కనువిందు చేస్తోంది. మూడు కలిసే ప్రాంతంలో శివాలయం మునిగి ఆలయం పై ఉన్న శివుని పాదాలు కడుగుతు మూడు పాయలు అద్భుతంగా కనువిందు చేస్తుండటంతో పర్యాటకులు ఫోన్లలో బంధిస్తున్నారు. – లంగర్‌హౌస్

బీబీకా ఆలం ఊరేగింపునకు భారీ బందోబస్తు



ఏసీపీ దామోదర్‌రెడ్డి

యాకుత్‌పురా: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా 10వ మొహర్రం సందర్భంగా శనివారం ఏనుగు అంబారిపై నిర్వహించే డబీర్‌పురా బీబీకా ఆలం సామూహిక ప్రధాన ఊరేగింపునకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని మీర్‌చౌక్ డివిజన్ ఏసీపీ సూదిరెడ్డి దామోదర్‌రెడ్డి తెలిపారు. పురానీహవేలిలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకొని డివిజన్‌లోని మీర్‌చౌక్, రెయిన్‌బజార్, భవానీనగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న ఆషూర్ ఖానాల వద్ద ప్రత్యేక పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. డబీర్‌పురాలోని బీబీకా ఆలావా వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. బీబీకా ఆలావాలోని అలంలాను దర్శించుకునేందుకు వచ్చే ప్రజలకు, ప్రముఖులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాల సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేశామని ఆయన చెప్పారు. ఈనెల 29న బీబీకా ఆలావా ఆలంల ప్రధాన ఊరేగింపును పురస్కరించుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్‌కమిషనర్, దక్షిణ మండలం డీసీపీల పర్యవేక్షణలో 1000 మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బందోబస్తులో నాలుగురు అదనపు ఎస్పీలు, 20 మంది డీఎస్పీలు, 30 మంది ఇన్‌స్పెక్టర్లు, 50 మంది ఎస్సైలు, 15 ప్లాటూన్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్, షీటీమ్స్, ప్రత్యేక నిఘా బృందాలతో పాటు సివిల్, ట్రాఫిక్ పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

నానల్‌నగర్‌లో ఎమ్మెల్యే పర్యటన



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు బస్తీలు, కాలనీలను అతలాకుతలం చేశాయని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని పలు బస్తీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు ప్రజలకు భరోసా ఇవ్వాల్సి అవసరం ఉందన్నారు. డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని, రోడ్లపై వర్షపు నీరు నిలిచి ఉందని, పలువురు స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేశారు. నల్లాలో నీరు సైతం రంగు మారి వస్తుందని పలువురు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. నల్లాల్లో కలుషిత జలాలు రాకుండా చూడాలని, తాను అధికారులను ఆదేశిస్తానన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, ఏఈ ఉదయ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ అలీ, స్థానిక మజ్లిస్ నాయకుడు షబ్బీర్ ఖాన్ తదితరులున్నారు.

బీసీ, మైనార్టీ ప్రజలకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం



మంత్రి తలసానికి వినతి పత్రం అందజేస్తున్న ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: బీసీ, మైనార్టీ వర్గాలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో మైనార్టీలు, బీసీలకు లక్షరూపాయాల చొప్పున ఆర్థిక సహాయాన్ని వెంటనే అందించాలని మంత్రి తలసానికి నందకిశోర్ వ్యాస్ బిలాల్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని విధంగా మైనార్టీలకు, బీసీలకు లక్ష రూపాయాల ఆర్థిక సహాయం చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్ దక్కిందన్నారు. అనంతరం బీఆర్‌ఎస్ గోషామహల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ... నియోజకవర్గం పరిధిలో బీసీ, మైనార్టీలతో పాటు అన్నివర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు ముందుంటానన్నారు. ఓ వైపు ఆదిత్య శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ తరఫున సేవలు చేస్తూ మరోవైపు ప్రభుత్వ పథకాలను, ప్రభుత్వ ఆర్థిక సహాయాలను, ప్రభుత్వ రుణాలను మంత్రి తలసాని సహకారంతో నియోజకవర్గం నలుమూలలా అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు పప్పుమాత్రే, సునిల్‌సాహు, కోటి శైలేష్ కురుమ, ప్రదీప్‌రాజ్, షేక్ మహ్మద్, అజర్, అవతారి యాదవ్, అనిత తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్ ఎమ్మెల్యే అభ్యర్థిపై అధిష్టానానిదే తుది నిర్ణయం



సమావేశంలో పాండూ యాదవ్, కార్పొరేటర్లు శంకర్‌యాదవ్, లాల్ సింగ్, సురేఖ ఓం ప్రకాష్

అఫ్జల్‌గంజ్: గోషామహల్ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అధిష్టానం ఇప్పటి వరకూ ఎవరి పేరును ఖరారు చేయలేదని నియోజకవర్గం పరిధిలోని కార్పొరేటర్లు, గోల్కొండ జిల్లా పార్టీ ముఖ్య నాయకులు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం గౌలిగూడలోని గోల్కొండ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి రఘునందన్‌యాదవ్ నివాసంలో పార్టీ ముఖ్య నేతలు, కార్పొరేటర్లు సమావేశమయ్యారు. గోల్కొండ జిల్లా అధ్యక్షుడు పాండుయాదవ్ అధ్యక్షతన బీజేపీ కార్పొరేటర్లు శంకర్‌యాదవ్, లాల్ సింగ్, సురేఖ ఓం ప్రకాష్, పార్టీ నాయకులు కృష్ణ, ఓం ప్రకాష్ భీష్వ, అవినాష్ దేవ్‌డా తదితరులు పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీలో చేరే వాళ్లకు అధిష్టానం ఎటువంటి హామీలు ఇవ్వదని, పార్టీ సిద్ధాంతాలు నచ్చి చేరే వారిని పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని చెబుతుందన్నారు. అభ్యర్థిత్వంపై అధిష్టానం ప్రకటన లేకుండానే ఈ మధ్యకాలంలో పార్టీలోకి వలస వచ్చిన ఒక నేత తానే గోషామహల్ నియోజకవర్గానికి కాబోయే ఎమ్మెల్యేనంటూ నిత్యం ప్రచారం చేసుకుంటున్నారే తప్ప పార్టీ అభివృద్ధికి ఏమాత్రం సహాయపడటం లేదన్నారు. ఎవరైనా పార్టీ పెద్దల పేర్లు చెప్పుకొని మీడియాలో ప్రచారం చేసుకుంటే భంగపాటు తప్పదని హెచ్చరించారు.

బాధ్యతల స్వీకరణ



ప్రసాదరావు

అబిడ్స్: నగరంలోని పలు పోలీస్‌స్టేషన్లలో ఎస్సైగా, ఇన్‌స్పెక్టర్‌గా, ఇటీవల పాతబస్తీలో ఏసీపీగా విధులు నిర్వహించిన జి.ప్రసాదరావుకు అడిషనల్ డీసీపీగా పదోన్నతి లభించింది. రాచకొండ పరిధిలోని ఎల్బీనగర్ జోన్ అడిషనల్ డీసీపీ ఎస్ఓటీ–2గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాచకొండ కమిషనర్, డీసీపీలను కలిశారు.

ధర్నాను విజయవంతం చేయాలి

సుల్తాన్‌బజార్: ఆగస్టు 10న న్యూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగే ఓబీసీ ధర్నాకు వేలాదిగా ఓబీసీలు తరలిరావాలని ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం బొగ్గులకుంటలోని బీసీ సాధికారత భవనంలో ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. ఆగస్టు 10న జంతర్‌మంతర్ వద్ద జరిగే ధర్నాలో ఓబీసీ సెంట్రల్ కమిటీ, జాతీయ బీసీ మహిళా సమాఖ్య ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొననున్నట్లు తెలిపారు. చిన్నయ్య, అచ్చయ్య, శ్రీనివాస్, లలిత, దశరథ్, రమేష్, శ్రీనివాసచారి, ప్రొ. వేలాద్రి, సువర్ణ, అంబిక పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు




శాలిబండ: టీఎస్ఎస్‌పీడీసీఎల్ మీరాలం, అత్తాపూర్, చందులాల్ బారాదరి సెక్షన్ పరిధిలోని విద్యుత్ శాఖలోని గృహ, వాణిజ్య వినియోగదారులందరూ తమ విద్యుత్ బిల్లులను సకాలంలో డిపార్ట్‌మెంట్ కౌంటర్లలో చెల్లించాలని టీఎస్ఎస్‌పీడీసీఎల్ మీరాలం సబ్ డివిజన్ ఆపరేషన్ ఏడీఈ వెంకటేశ్ తెలిపారు. భారీ వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని ఫిర్యాదులు వస్తే విద్యుత్ సరఫరాను వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఎప్పటికప్పుడు పునరుద్ధరిస్తున్నామన్నారు. వర్షం కారణంగా విద్యుత్ బిల్లులు వసూలు చేసేందుకు ఇంటికి రావడం సాధ్యం కాదని.. విద్యుత్ బకాయిలను సకాలంలో చెల్లించి సహకారం అందించాలన్నారు. విద్యుత్ వినియోగదారులకు 24 గంటల పాటు సేవలు అందించేందుకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మీరాలం ఏఈ శ్రీనివాస్, అత్తాపూర్ ఏఈ నర్సింగ్ రావు, చందులాల్ బారాదరి ఏఈ షబ్బీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



యాకుత్‌పురా: బస్తీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ మీర్జా రెహమత్ అలీ బేగ్ అధికారులకు సూచించారు. ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి జలమయమైన తలాబ్‌చంచలం డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాలతో పాటు పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, నాలా అభివృద్ధి పనులను ఆయన కార్పొరేటర్ డాక్టర్ సమీనా బేగం, పార్టీ నాయకులు, జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. భవానీనగర్, నషేమాన్‌నగర్, తలాబ్‌కట్టా, సిద్దిఖీనగర్ ప్రాంతాల్లో పర్యటించి డ్రైనేజీ, రోడ్ల సమస్యలపై అధికారులతో ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

జగదీశ్‌మార్కెట్‌లో ఉద్రిక్తత



అబిడ్స్: ఓ సెల్‌ఫోన్ దుకాణాన్ని భవనం నిర్మించే యజమానాలు కూల్చివేయడంతో అబిడ్స్ జగదీశ్ మార్కెట్‌లో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. జగదీశ్‌మార్కెట్ ప్రాంతంలో కొన్ని ఏళ్లుగా కొనసాగిన శాంతాబాయి నర్సింగ్‌హోమ్‌ను కొంతమంది బిల్డర్లు తమ ఆధీనంలోకి తీసుకుని భవన నిర్మాణం చేపడుతున్నారు. ఆ స్థలంలోనే సంజీవ్‌కుమార్ అనే వ్యాపారి 16 ఏళ్లుగా సెల్‌ఫోన్ దుకాణం ఏర్పాటు చేసి అద్దెకు ఉంటున్నాడు. బిల్డర్లకు సెల్‌ఫోన్ దుకాణం యజమాని మధ్య వివాదం చోటు చేసుకుంది. గురువారం రాత్రి బిల్డర్లు సంజీవ్‌కుమార్ సెల్‌ఫోన్ దుకాణాన్ని బుల్‌డోజర్లతో కూల్చివేశారని సంజీవ్‌కుమార్‌తో పాటు పెద్ద ఎత్తున వ్యాపారులంతా ఆందోళనకు దిగారు. సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ.. దాదాపు రూ.40 లక్షల విలువైన సెల్‌ఫోన్ సామగ్రి ధ్వంసమయ్యాయని, తనకు తీవ్ర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. బిల్డర్లతో తనకు ప్రాణహాని ఉందని, పోలీసులు అధికారులు తనకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం జగదీశ్ మార్కెట్ లోని వందలాది మంది సంఘటన స్థలానికి వచ్చి బిల్డర్లకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేయడంతో పరిసరాల్లో తీవ్ర ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

3న ఉద్యోగుల సభ

గన్‌ఫౌండ్రీ: ఆగస్టు 3న కోఠి ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఉద్యోగుల సభ నిర్వహిస్తున్నట్లు టీఎన్జీఓ నగర అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ తెలిపారు. శుక్రవారం గన్‌ఫౌండ్రీలోని డీఈఓ కార్యాలయంలో నగర శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగుల పరిష్కార సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పాత పెన్షన్ విధానం అమలు, జీఓ 317 వల్ల నష్టపోయిన ఉద్యోగులకు న్యాయం, ఆరోగ్య కార్డులు అందజేత వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. డీఈఓ కార్యాలయ ఉద్యోగులు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. టీఎన్జీఓ నగర కార్యదర్శి విక్రమ్, పాఠశాల విభాగం నగర అధ్యక్షుడు కే ఆర్ రాజ్‌కుమార్, కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



బస్తీలో పర్యటిస్తున్న మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, నాయకులు

గౌలిపురా: కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జలమయమైన లోతట్టు ప్రాంతాల్లో గౌలిపురా డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం కలిసి పర్యటించారు. బస్తీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. డివిజన్‌లోని ప్రజలు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యాకుత్‌పురా అసెంబ్లీ కన్వీనర్ గౌలీకర్ ధీరజ్‌లాల్, భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి సుమన్ కుమార్ ముదిరాజ్, భాగ్యనగర్ జిల్లా మజ్దూర్ మోర్చా కన్వీనర్ జమాల్‌పూర్ అశోక్, బస్తీవాసులు మహేశ్, వేణుగోపాల్ చారి పాల్గొన్నారు.

సుమతీనరేంద్రకు పురస్కారం ప్రదానం

నాంపల్లి: జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి కారణజన్ముడని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. సినారె 92వ జయంతి సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు డాక్టర్ పి. సుమతీ నరేంద్రకు కిన్నెర–సినారె సాహితీ పురస్కారం ప్రదానోత్సవ సభ శుక్రవారం రాత్రి నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరిగింది. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ.రమణాచారి హాజరై, సభా ప్రారంభకులుగా హాజరైన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్ రావుతో కలిసి డాక్టర్ పి.సుమతీ నరేంద్రకు పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. నవనిధి బిల్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సి.ఎం.డి భార్గవరామ్ సర్వేపల్లి, ఇందూర్ గ్రూప్ ఆఫ్ కాలేజెస్ చైర్మన్ ఆర్.ప్రదీప్‌రెడ్డి, తెలంగాణ సారస్వత పరిషత్ కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య యాదవ్, కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్ హాజరయ్యారు.

పక్షుల సంరక్షణ మన అందరి బాధ్యత



మాట్లాడుతున్న డాక్టర్ అసద్ రహమానీ

గోల్కొండ: పక్షుల సంరక్షణ మనందరి బాధ్యత అని పక్షి శాస్త్రవేత్త డాక్టర్ అసద్ రహమానీ అన్నారు. శుక్రవారం గోల్కొండ నయాఖిల్లాలోని హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ సెమినార్ హాల్‌లో టీటీటీజజీజీజీ ఎర్త్ సిరీస్ కార్యక్రమం జరిగింది. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచంలో ఎన్నో దేశాల్లో కొన్ని పక్షులు అంతరించిపోయాయని, మరికొన్ని అరుదైన జాతుల పక్షుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆయన అన్నారు. ప్రపంచంలోని వివిధ దేశాల్లో పక్షి జాతులు ఎన్నో ఉన్నాయని, మన దేశంలో 1600 రకాల పక్షు జాతులు ఉన్నాయని ఆయన అన్నారు. అయితే నేటి యువతకు అరుదైన పక్షుల పేర్లు, వారి ఆవాసం, జీవనశైలి తెలియదని, పర్యావరణంపై అవగాహన లేకపోవడమే దీనికి కారణమని ఆయన అన్నారు. అనంతరం డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ కో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి.ప్రకాశ్ రచించిన బర్డ్స్ అండ్ బిలీఫ్స్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పక్షుల ఫొటో ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. విశ్రాంత ఐఏఎస్ అధికారులు అజయ్ మిశ్రా, ఎస్.కె.జోషి, జి.వి.ప్రసాద్, హెచ్.జి.ఎ. అధ్యక్షులు జయంత్ ఠాకూర్ ఉన్నారు.

బాల్య వివాహం కేసులో నిందితులకు 20 ఏళ్ల జైలు

చాంద్రాయణగుట్ట: బాల్య వివాహం జరిపించిన ఘటనలో ముగ్గురు నిందితులకు న్యాయస్థానం 20 ఏళ్ల జైలు శిక్ష విధించగా.. మరో ఇద్దరికి రెండేళ్ల జైలు శిక్షను విధించింది. పోలీసుల వివరాల ప్రకారం.. జంగమ్మెట్ బుడగజంగాల బస్తీకి చెందిన 14 ఏళ్ల బాలికకు చదువుపై ఎంతో ఇష్టం ఉన్నప్పటికీ.. బలవంతంగా 2018 ఆగస్టు 12న సుధాకర్(22)తో వివాహం జరిపించారు. ఈ ఘటనపై సీడబ్ల్యూఎస్ అధికారుల ఫిర్యాదు మేరకు ఛత్రినాక పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కేసును విచారించిన పోక్సో యాక్ట్ స్పెషల్ సెషన్స్ జడ్జి అనిత సుధాకర్‌తో పాటు అతని తల్లిదండ్రులు జంగయ్య(45), సునిత(40)లకు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా, మధ్యవర్తిత్వం వహించిన బాలయ్య(33), రాధిక(35) రెండేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు. బాధిత బాలికకు రూ.5 లక్షల పరిహారం కూడా చెల్లించాలని ఆదేశించారు.